డీహెచ్‌పీఎస్ జిల్లా మహాసభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) 3వ జిల్లా మహాసభ ఈ నెల 18వ తేదీన ట్యాంక్ బండ్ రోడ్డు లో ఉన్న అమర్ భవన్ లో జరుగుతుందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోకా రమేష్ బాబు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా గురువారం అమర్ భవన్ లో సంఘం కరపత్రాన్ని సంఘం గౌరవ అధ్యక్షులు అంబేద్కర్ అశోక్, ఉపా అధ్యక్షులు సి.పి.ఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. రమేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని అనే నినాదంతో మహాసభ జరుగుతుందని, ఈ మహాసభకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జే.వి.ప్రభాకర్, కరవది సుబ్బారావులు పాల్గొంటున్నారని, కావున జిల్లాలో గల దళితులు హాజరై జయప్రదం చేయాలని, ఈ కార్యక్రమంలో విజయనగరం నియోజకవర్గం కన్వీనర్ అయినాడ కృష్ణ, గంట్యాడ మండల కార్యదర్శి రేగిటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మండలంలోని నారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని, వెల్నెస్ కేంద్రాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. 67.50లక్షల రూపాయలతో నిర్మించిన పలు భవనాలను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షులు మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ పరిపాలన వికేంద్రీకరణ చేసి, సాంఘిక భద్రతను కల్పిస్తూ సంతృప్తి విధానంలో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందన్నారు. ఈ రోజు నారాయణపురంలో సచివాలయ భవనాన్ని రైతు భరోసా కేంద్రాన్ని సెంటర్ ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మెరుగైన సేవలను అందించి సామాజిక న్యాయంతో పాటు మహిళా సాధికారత సాధించే దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను ఎరువులను అందిస్తూ రైతులకు అవసరమైన సలహా సూచనలు చేస్తూ సహాయకారిగా దోహదపడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరికి మెరుగైన ఆరోగ్యం అందించాలన్న ఉద్దేశంతో వెల్నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటికే వైద్యులను పంపించి వారి ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ శశి భార్గవి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి తద్వారా ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటికి వైద్యులను సిబ్బందిని పంపించి ఆరోగ్య వివరాలను సేకరించడం నూతన విధానమని అన్నారు. ఎంపీటీసీ తులసి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ప్రజా రంజక పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మండల పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ

విశాలాంధ్ర-తెర్లాం: బాడంగి భవిత కేంద్రంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దృష్టిలోపం, వినికిడి లోపంగల దివ్యాంగ విద్యార్థులకు మరియు ప్రత్యేక ఉపాధ్యాయులకు డిజిటల్ ట్యాబులు లు ఎంఈఓ-2 ఎం.రాజేశ్వరి ద్వారా పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దివ్యాంగుల విద్యకు ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని మండలానికి ఒక భవితకేంద్రం ద్వారా దివ్యాంగ విద్యార్థులకు అన్నిరకాల విద్యా ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని వినియోగించుకోవాలని మండలానికి చెందిన దివ్యాంగ విద్యార్థులకు మరియు ప్రత్యేక ఉపాధ్యాయులకు సుమారు 2.5లక్షల రూపాయలు విలువచేసే సామ్ సంగ్ మరియు లెనోవా ట్యాబులను పంపిణీ చేయడం జరిగిందని, ఇదిచాలా అద్భుతమైన కార్యక్రమమని అన్నారు. దీనివలన దివ్యాంగ విద్యార్థులు కూడా సాధారణ విద్యార్థులతో పాటు డిజిటల్ విద్యను సులభంగా నేర్చుకోవడానికి వీలవుతుందని అన్నారు. ఈ టాబ్ లలో 33రకాల యాప్ లను ఇన్స్టాల్ చేయడం జరిగిందని ,వాటిద్వారా దృష్టిలోపం మరియు వినికిడి లోపంగల దివ్యాంగ విద్యార్థులు సులభంగా విద్యను నేర్చుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, ఐఈఆర్పీ సత్యన్నారాయణ, సరిత మండలానికి చెందిన దివ్యాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం ఢీకొని నలుగురికి గాయాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలో ఫూల్ బాగ్ కాలనీ సమీపంలో విజయనగరం నుంచి నెల్లిమర్ల వైపు వెళ్తున్న బొలెరో వాహనం గురువారం రాత్రి ఆటో ను ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. వీరిలో ఓ వ్యక్తికి తలకు తీవ్ర గాయాలు అవ్వడంతో పరిస్థితి విషమంగా ఉంది. గాయపడ్డ క్షతగాత్రులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. విజయనగరం నుంచి నెల్లిమర్ల వైపు వెళుతున్న బొలెరో వాహనం ముందుగా పల్సర్ వాహనాన్ని ఢీకొన్న తర్వాత ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తా కొట్టడంతో ఆటోలో ఉన్న ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడినట్లు తెలిసింది. అయితే ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కృషి విజ్ఞాన కేంద్రం నిలిపివేయాలని రెండవ రోజు నిరాహార దీక్ష.

విశాలాంధ్ర-దత్తిరాజేరు: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఇంగిలాపల్లి సచివాలయం ఎదుట కృషి విజ్ఞాన కేంద్రం నిలిపివేయాలని రెండో రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రానికి మేము వ్యతిరేకం కాదని చినచామలాపల్లి గొర్రెల, మేకల పెంపకం వృత్తి దారుల జీవనానికి ఆ కొండ భూమి తప్ప పెంపకానికి భూమి ఆ పక్కన లేదని అలాంటి పరిస్థితుల్లో ఆ భూమి తీసుకోవడం అనే నిర్ణయమే చాలా అన్యాయం, తప్పు కావున ప్రభుత్వం, అధికారులు తక్షణమే వృత్తిదారుల రైతుల బాధలను అర్థం చేసుకొని కృషి విజ్ఞాన కేంద్రమునకు భూమి నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ జిల్లాలో ప్రభుత్వం వారు గిరిజన యూనివర్సిటీ కోసం భూమిని సేకరించింది అలాగే ఇతరత్రా ప్రాంతాల్లో అవసరాల కోసం సేకరించిన భూమి కూడా ఉంది. అర్థం చేసుకుని ప్రత్యామ్నాయ భూములను ఎంచుకోవాలని కోరారు. గొర్రెల మేకల పెంపకం వృత్తిని పూర్తిగా ధ్వంసం చేసి వారి బతుకులు తీసి కృషి విజ్ఞాన కేంద్రానికి ఈ ప్రాంతంలో భూములు తీసుకోవడం ఎంతవరకు న్యాయమని వాపోయారు ఈ కార్యక్రమంలో జి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సిఎం చేయాలి

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైసిపి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి కొండపేటలో 2,3 వార్డులలో నియోజకవర్గ పరిశీలకులు అంధవరపు సూరిబాబుతో కలిసి ఎమ్మెల్యే బడ్డుకొండ గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కోసం వివరించారు. సంక్షేమ పథకాలు అమలుకావాలన్నా, నవరత్నాలు మీ ఇంటికి చేరాలంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కులమతాలు పార్టీలకు అతీతంగా నేడు సంక్షేమ పథకాలు అందిస్తే టిడిపి హయాంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే పథకాలు అందేవని చెప్పారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ బంగారు సరోజిని, నగరపంచాయతీ వైసిపి కన్వీనర్ చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కౌన్సిలర్లు మొయిద శ్రీనివాసరావు, పైల భారత, జెసిఎస్ కన్వీనర్ మజ్జి గణేష్ పాల్గొన్నారు.

మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి నాలుగేళ్లు జైలు శిక్ష

విశాలాంధ్ర-బొబ్బిలి : 2019వ సంవత్సరం పదో నెల 29న పట్టణం, వెలమ వారి వీధికి చెందిన ఒక మైనర్ బాలిక పై అసభ్యకరంగా ప్రవర్తించిన విక్రమ్ ఏసు సన్నాఫ్ వెంకటరావు 34 సంవత్సరాల , ఓంకార్ థియేటర్ వీధికి చెందిన బాలిక బొబ్బిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది.బొబ్బిలి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబరు 428/2019 ఐపీసీ సెక్షన్ 354 , 8 ఆఫ్ ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి అప్పటిలో ఎస్సైగా విధులు నిర్వర్తించిన కేటీఆర్ లక్ష్మి దర్యాప్తు చేపట్టారు. విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జ్ సీటు ఫైల్ చేయడం జరిగింది. అనంతరం , పోక్సో కోర్టు సాక్షులను విచారించి, నేరం నిరూపణ ఆయన మేరకు, ముద్దాయి అయిన విక్రమ్ ఏసుకు విజయనగరం ఫోక్సో కోర్టు జడ్జి కె.నాగమణి నాలుగు సంవత్సరాల సాధారణ శిక్ష మరియు 1000 రూపాయలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చినట్లు బొబ్బిలి పోలీసులు తెలిపారు.

ధీర ఫౌండేషన్, అరబిందో ఫార్మా ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మహిళలు కేవలం ఇంటికి పరిమితం కాకుండా,పురుషులతో సమానంగా ప్రపంచంతో పోటీపడుతున్న తరుణంలో,మహిళలు విద్యతోపాటు, ఉపాధి శిక్షణ మరియు ఉద్యోగ రంగాల్లో మంచి నైపుణ్యంతో రాణించాలని మహా సంకల్పంతో, అరబిందో ఫార్మసీ ఫౌండేషన్ సహకారంతో,దీరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రివర్యులు బొత్స సత్యనారాయణ నివాసంలో, పూర్వ లోక్ సభ సభ్యులు డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి ,అరబిందో ఫార్మసీ ఫౌండేషన్ హెచ్ ఆర్ కమలాకర్ రెడ్డి , దీరా ఫౌండేషన్ సిఇఒ చక్రధర్ ముఖ్య అతిథులుగా పాల్గొని వారి చేతుల మీదుగా, విజయనగరం జిల్లా, జొన్నవలస గ్రామం కేంద్రంగా ఉచిత శిక్షణ మరియు ఉపాధి కల్పనలో భాగంగా టైలరింగ్ లో శిక్షణ పొందిన 60 మంది మహిళలకు సర్టిఫికెట్స్ పంపిణీ జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఉచిత శిక్షణ పొందిన మహిళలు కుట్టిన వస్త్రాలను డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి పరిశీలించి ఉచిత శిక్షణ మరియు ఉపాధి కల్పనలో భాగంగా మంచి నైపుణ్యంతో రాణించి మరెన్నో నూతన అవకాశాలను అందిపుచ్చుకోవాలని శిక్షణ పూర్తి చేసుకున్న యువతను అభినందించారు.

మహిళా పక్షపాతి మన సీఎం జగన్

డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

విశాలాంధ్ర-వేపాడ: మన ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతీ అని డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు అన్నారు. మండల కేంద్రం వేపాడ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ కుటుంబాల దక్షతలో మహిళలదే కీలక పాత్ర అని భావించిన సీఎం జగన్ ప్రతి పథకాన్ని మహిళల పేరిట మంజూరు చేయడం హర్షనీయమన్నారు. అలాగే పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలుచేసిన సీఎం జగన్ చరిత్రకారుడుగా నిలిచిపోయారన్నారు. ఎంపీడీఓ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జోనల్ ఇంచార్జి మెరపుల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ప్రతి సంక్షేమ పథకాన్ని అందించిన ఘనత జగన్ కే దక్కుతుందన్నారు. ఈ నాలుగేళ్లలో కేవలం వేపాడ మండలానికి రూ.20 కోట్లకు పైగా సంక్షేమపథకాలు ప్రజలు గ్రహించుకోవాలన్నారు. అనంతరం ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, మండల వైసీపీ అధ్యక్షులు ముమ్ములూరి జగ్గిబాబు, ఏఎంసి ఛైర్పర్సన్ మూకల కస్తూరి తదితరులు జగన్ చేస్తున్న విప్లవాత్మాక పాలనను మరెవరు చేయలేరని, జగన్ ను మరలా ఎందుకు గెలిపించుకోవాలో అందరికి వివరించారు.సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరలా జగన్నే సీఎంగా గెలిపించుకోవాలన్నారు.అనంతరం వేపాడలో పార్టీ జెండాను ఆవిష్కరించి, గ్రామంలో ఇంటింటికి తిరిగి పల్లె నిద్ర చేసారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులందరు పాల్గొన్నారు.

జన్నివలసలో పారిశుధ్యం అధ్వానం :మాజీ సర్పంచ్

విశాలాంధ్ర-రామభద్రపురం : మండలంలోని జన్నివలస గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని గ్రామ మాజీ సర్పంచ్ ఓగునాయుడు అన్నారు. గురువారం ఆయన జన్నీవలస గ్రామంలో ఆయన మాట్లాడుతూ కొన్ని నెలల నుండి కాలువలలో చెత్తతో నిండిపోయి కంపుకొడుతున్నాయన్నారు. వీధులలో ఎక్కడ చూసినా మురుగనీటితో కాలువలు దర్శనమిస్తున్నాయని అన్నారు. దీనిపై సర్పంచ్, ఇతర అధికారులు స్పందించి తక్షణమే పారిశుధ్యం పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పనులు చేయకపోతే ప్రజలకు ప్రాణాంతకమైన డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి రోగాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు.

సీతం లో సాంకేతిక రంగం లో ముఖ్యమైన యాంత్రిక నాణ్యత అంశాలపై కార్యశాల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం మెకానికల్ విభాగానికి చెందిన రెండు ,మూడు మరియు నాలుగో సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు అప్లికేషన్స్ ఆఫ్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ మెథడ్స్ అనే అంశంపై ప్రత్యేక కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి ఎన్.డి.టి ట్రైనర్ డి. వి.వి నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ కోర్స్ ప్రాముఖ్యతను, ఈ ఎన్డిటి ని ఉపయోగించడం ద్వారా పరిశ్రమలోని యంత్ర సామాగ్రి, పరికరాల నాణ్యతను, మన్నికను పెంపొందించవచ్చని విద్యార్థులకు పూర్తి స్థాయిలో దీనిగొప్పతనాన్ని తెలియజేసి, విద్యార్థుల్లో శిక్షణ నైపుణ్యాలపై ఆసక్తి కలిగేలా బోధించారు. ఆర్‌విఎస్ ఉపాధి కల్పన అధికారి చందన్ మాట్లాడుతూ సీతం కళాశాలలో ఎన్‌డిటి పై ఆసక్తి, ఉత్సాహం ఉన్న ప్రతి ఒక్క విద్యార్థికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. ఆర్ వి ఎస్ బృందం నిపుణులతో నిర్వహించి ఈ రెండు రోజులు వర్క్ షాపులో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ పద్ధతులపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఈ రంగంలో శిక్షణ ఇచ్చి సర్టిఫికేషన్ చేయించి సక్రమ మైన భవిష్యత్తు ప్రణాళిక అందించడం ద్వారా విద్యార్థులకు సత్వర మరియు పటి ష్టమైన ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి రామమూర్తి మాట్లాడుతూ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ మెథడ్స్ పై తనకున్న అనుభవాలు పంచుకుంటూ, మెకానికల్ విభాగంలో నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ యొక్క ఉపయోగాన్ని విద్యార్థులకు తెలియజేశారు. మెకానికల్ విభాగాధిపతి సి. హెచ్ వెంకట లక్ష్మి విద్యార్థులకు ఎన్.డి. టి పై సూచనలు అందించారు. ఈ కార్య క్రమంలో అధ్యాపకులు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్థాపితం : 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లాలలో ఈ క్రింది మండలాల్లో కంట్రిబ్యూటర్లు కావలెను.
అర్హతలు : అభ్యర్థులు సమకాలీన అంశాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు కనీసం ఇంటర్ చదివి ఉండాలి.
విజయనగరం జిల్లాలో కావల్సిన ప్రాంతాలు :
బాడంగి, గజపతినగరం రూరల్, కొత్తవలస రూరల్ బొండపల్లి, విజయనగరం రూరల్/అర్బన్, విజయనగరం క్రైం, బొబ్బిలి రూరల్, రాజాం, రాజాం రూరల్, నెల్లిమర్ల రూరల్.
ఆసక్తిగల అభ్యర్థులు దిగువ నెంబర్‌కు సంప్రదించగలరు.
9618320716
పార్వతీపురం మన్యం జిల్లాలో కావల్సిన ప్రాంతాలు :
జియ్యమ్మవలస, సాలూరు టౌన్, వీరఘట్టం, భామిని బలిజిపేట, పార్వతీపురం కలెక్టరేట్, పార్వతీపురం రూరల్
ఆసక్తిగల అభ్యర్థులు దిగువ నెంబర్‌కు సంప్రదించగలరు.
9441058743

పార్వతీపురం మన్యం

పోరాట కమిటీ నాయకులపై కేసు కొట్టివేత

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మండలం బొడ్డవలస పంచాయతీలో 2016 లో జరిగిన “బోడికొండ” అక్రమ గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కంపెనీ యాజమాన్యం, పార్వతీపురం రూరల్ పోలీసులు అధికారులు కలిసి పోరాట కమిటీ నాయకులు, గిరిజనులు 31 మందిపై పలు సెక్షన్ ల కింద కేసు నమోదు చేసారు. అయితే ఈ కేసును బుధవారం న్యాయం స్థానం కొట్టివేయడం జరిగింది. పోరాట కమిటీ నాయకుల తరుపున న్యాయవాదులు శాంతిరాజు, మన్మధరావు, కృష్ణ వాదనలు వినిపించారు. ఈసందర్భంగా పోరాట కమిటీ నాయకులు పాలక రంజిత్ కుమార్, పోలా రమణి, వెలగాడ కృష్ణ తదితరులు మాట్లాడుతూ గిరిజన ప్రజల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అడవుల నుండి గిరిజనులను తరిమే యాలనే ఆలోచనలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని డిమాండ్ చేసారు. ఈకేసులో ఎ1 గా ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఉన్నారు. ఆయనతో పాటు దివంగత సిపిఎం నేత రెడ్డి శ్రీరామమూర్తి, అఖిల భారత రైతు కూలి సంఘం నాయకులు పోల ఈశ్వరరావు, పాలక రంజిత్ కుమార్, వెలగాడ కృష్ణ, పోలా రమణి తదితరులు నిందితులుగా చేర్చబడ్డారు.

బాల్య వివాహాల నివారణ మనందరి బాధ్యత: ఎంపిడిఓ మహేష్ రెడ్డి

విశాలాంధ్ర-సీతానగరం: బాల్య వివాహాలు నివారణ మనందరి సామాజిక బాధ్యతగా గుర్తించి వాటిని నివారించాలని ఎంపిడిఓ కృష్ణ మహేష్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మైత్రాయిస్ ఫౌండేషన్ మహిళా వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గ్రామస్థాయి స్టేట్ హోల్డర్స్ ట్రైనింగు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిడిఓ మాట్లాడుతూ అక్రమ రవాణా నిర్మూలన, గృహహింస నిర్మూలన, బాల్య వివాహాలు నిర్మూలన, బాల కార్మికుల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు.గ్రామస్థాయిలో కొంతమందిని ఎంపిక చేసి వారిని రక్ష మరియు కమ్యూనిటీ లీడర్ అని చెప్పి గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి వీరికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పద్మ తెలిపారు.పూర్తిస్థాయిలో ఆయా గ్రామాల్లో ఉన్న ఇలాంటి సమస్యలపై పనిచేయడానికి ఈ కమిటీ మెంబర్లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు, జెడ్పీటీసీ బాబ్జి,ఐసీడీఎస్ పిఓ సుగుణ, ఈఓపిఆర్డీ వర్మ, మహిళ పోలీసులు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల తొలగింపులో అధికారులు వివరణ ఇవ్వాలి



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణ ప్రధాన రహదారిలో ఉన్న చెట్ల ను ఎందుకు తొలగించారో వివరణ ఇవ్వాలని జనసేన పార్టీ జిల్లా నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా పార్వతీపురం పట్టణ మెయిన్ రోడ్డులో మున్సిపల్ అధికారులు చెట్లు తొలగింపు కార్యక్రమంలో అత్యుత్సాహం ఎందుకు ప్రదర్శిస్తున్నారో ప్రజలకు వివరించాలన్నారు.తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, కాలువలు, పశువులు, పందులు, ఆక్రమణలు కబ్జాలు, చెరువుల్లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు తదితర సమస్యలు మున్సిపాలిటీ ని వేధిస్తుంటే సుమారు గత పది ఏళ్లుగా పట్టణ మెయిన్ రోడ్డులో పచ్చగా పెరిగిన చెట్లను రాత్రికి రాత్రి తొలగించే కార్యక్రమాన్ని ఎందుకు చేపట్టారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈనెల 10వ తేదీన అధికార పార్టీ చేపట్టబోయే కార్యక్రమానికి వీలుగా మున్సిపల్ అధికారులు చెట్లు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారని ఆరోపించారు.

ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దాలి

పీవో కల్పనకుమారి

విశాలాంధ్ర-సీతంపేట:ఓటర్ల జాబితాలో ఉన్న తప్పిదాలను త్వరితగతిన సరిదిద్దాలని ఐటిడిఎ పీవో కల్పన కుమారి అన్నారు. గురువారం సీతంపేట, భామిని మండలాల సూపర్ వైజర్లు, బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఉన్న ఓట్లను తొలగించేటప్పుడు ఎన్నికల నియామావళికి అనుగుణంగా తొలగించాలని సూచించారు. కొత్తగా ఓటు నమోదుకు అర్హత ఉన్నవారిని చేర్పించాలని అన్నారు. చనిపోయిన వారి ఓట్లను మరణ ధ్రువీకరణ పత్రం ద్వారా నిర్ధారించుకొని తొలగించాలని అన్నారు. సరిగ్గా కనబడని, తప్పుగా ముద్రించబడిన ఫోటోలను మార్చాలని అన్నారు. సూపర్ వైజర్లు, బిఎల్వోలు బాధ్యతగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీతంపేట, తహశీల్దార్ నరసింహమూర్తి భామిని తాసిల్దార్, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోగమ్మపేటలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

600మంది క్రీడాకారులు, కోచ్‌లు, తల్లిదండ్రులు హాజరు



విశాలాంధ్ర-సీతానగరం: రాష్ట్రస్థాయి 67వ కరాటేపోటీలను పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతానగరం మండలంలో జోగమ్మపేటలోని డాక్టరు బి ఆర్ అంబేద్కర్ గురుకులం, ప్రతిభ పాఠశాల, కెజిబివి విద్యాలయాల ప్రాంగణంలో మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు, శాసన మండలి సభ్యులు పాకలపాటి రఘువర్మలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడల వల్ల మానసిక ఒత్తిడి తగ్గి,విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు.మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు.జిల్లా విద్యాశాఖాధికారి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ ఎన్ ప్రేమ్ కుమార్ , జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎన్ వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ మూడు రోజులుపాటు అండర్ 14,17,19బాలురు, బాలికలకు సంబంధించి దాదాపు 600మంది క్రీడాకారులు, కోచ్ లు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో 14,17,19 సంవత్సరాలలోపు పాల్గొన్న బాలురు-బాలికలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు,జెడ్పీటీసీ బాబ్జి,సర్పంచ్ కల్యంపూడి సింహాచలం, ఎంఈఓలు సూరి దేముడు, వెంకటరమణ, ప్రిన్సిపాళ్లు కె.ఈశ్వరరావు,పి.వెంకటనాయుడు, జె.సంధ్య, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పిడిలు, పిఈటిలు డిటి గాంధీ, ఎం.వాసుదేవరావు, మజ్జి రామకృష్ణ, మండంగి మురళి,ముప్పాళ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో వేరుశనగ అంతరపంట

విశాలాంధ్ర-పాచిపెంట: ప్రయోగాత్మకంగా పత్తి లో అంతర పంటగా వేసిన వేరుశనగ పంట దిగుబడి బాగుందని రైతులు కేవలం ఒకే పంట మీద ఆధారపడకుండా వేసుకున్నట్లయితే అంతర పంటల ఆదాయం ప్రధాన పంటకు పెట్టే పెట్టుబడికి సమానంగా వస్తుందని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు. కర్రివలస గ్రామంలో రైతు గూనాపు రామారావు పత్తి చేనులో వేసిన వేరుశనగ అంతర్ పంటను పరిశీలించారు ఈ సందర్భంగా రైతు తన పత్తిలో వేరుశనగ అరయకరం మినుములు ఒక ఎకరం వేసాను అని చుట్టూ కంది విత్తనాలు వేసుకున్నామని అర ఎకరంలో మూడు బస్తాల వేరుశనగ దిగుబడి వచ్చిందని మినుములు అంతర్ పంట కూడా బాగుందని రైతులకు ఈ విధానం ఎంతో మేలని తెలిపారు వ్యవసాయ అధికారి మాట్లాడుతూ అంతర పంటలతో కేవలం అదనపు ఆదాయం రావడమే కాకుండా జీవ వైవిధ్యం పెరిగి ఉపయోగకర కీటకాల సంఖ్య పెరగడం వలన చీడపీడల ఉధృతి తగ్గుతుందని కలుపు ఉధృతి కూడా తగ్గుతుందని అంతేకాకుండా వేరుశనగ, వేర్ల బుడుపులపై ఉండే రైజోబియం బ్యాక్టీరియా గాలిలో ఉన్న నత్రజనినీ గ్రహించి ప్రధాన పంటకు యూరియాను అందిస్తుందని కాబట్టి రైతులంతా అంతర పంటలపై దృష్టి సారించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఐ సి ఆర్ పి సురేష్ పాల్గొన్నారు.

నేడు డైల్ యువర్ డియం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నేడు డైల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడునని పార్వతీపురం డిపో పరిధిలోని ప్రజా రవాణా సమస్యలపై ప్రయాణికులు 9959225621 ఫోన్ నెంబర్ కు డయల్ చేసి మీ సమస్యను తెలియజేసి పరిష్కారం పొందవచ్చునని కోరారు.

పదిలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్



విశాలాంధ్ర-మక్కువ: రానున్న పదవ తరగతి పరీక్షల్లో శత శాతం ఫలితాలు సాధించాలని పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్ అన్నారు. మక్కువ మండలం ఎర్ర సామంతుల వలస ఆశ్రమ పాఠశాలను గురువారం ప్రాజెక్టు అధికారి సందర్శించారు. పాఠశాల పరిసరాలను, ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. పారిశుధ్యం పక్కాగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. విద్యా బోధనలో లోపాలు ఉండరాదని ఆయన పేర్కొన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో ముఖా ముఖి మాట్లాడారు. పదవ తరగతి పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలని అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళికతో ఇష్టపడి చదవాలని ఆయన సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువుకు అడుగులు వేయాలని ఆయన అన్నారు. ఇష్టంతో చదివితే ఏదీ కష్టం కాదని హితవు పలికారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఎర్ర సామంతుల వలస, అనసభద్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ జె శాంతీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి

జె సీ కి వినతి పత్రం అందించిన అంగన్వాడీలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: అంగన్ వాడీల వేతనాలు చెల్లించాలని జాయింట్ కలెక్టర్ కు పలువురు అంగన్వాడీలు జాయింట్ కలెక్టర్ గోవిందరావు కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు ఎం ఉమామహేశ్వరి మాట్లాడుతూ వర్కర్స్ కు వచ్చే వేతనాలు తక్కువ పండగ పూట కూడా వేతనాలు లేకుండా దసరా దీపావళి పండగలు చేసుకోలేని పరిస్థితి ఉందని అదే విధముగా దీపావళి వస్తుంది కావున పిల్లలు పండగ పూట కూడా అంగన్వాడి వర్కర్లు పస్తులు ఉంచుకోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు జిల్లా కార్యదర్శి గంట జ్యోతి మాట్లాడుతూ వర్కర్స్ అంతా జీతాలు బిల్లులు టైం కి రాక సెంటర్ నడుపుకోవడం కూడా కష్టంగా ఉందని తెలియజేశారు జిల్లా నాయకులు ఇందిరా గారు మాట్లాడుతూ అందరికీ జీతాలు చెల్లించి వర్కర్స్ కళ్ళల్లో వెలుగును నింపాలని కోరారు వెంటనే జెసి గారు పిడి గారికి ఫోన్ చేసి జీతాలు ఇవ్వకపోవటానికి కారణం తెలుసుకొని వెంటనే జీతాలు అయ్యే విధంగా చర్యలు చేపడతామని కోరారు.

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోండి

జూనియర్ సివిల్ జడ్జి జస్టిస్ సౌమ్య జాయ్‌పిన్

విశాలాంధ్ర-సాలూరు రూరల్: నిరుపేదలకు కోర్టుల ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని వీటిని వినియోగించుకోవాలని సాలూరు జూనియర్ సివిల్ జడ్జి జస్టిస్ సౌమ్య జాస్మిన్ అన్నారు.గురువారం జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా మెప్మా,స్ఫూర్తి మహిళా మండలి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో జస్టిస్ సౌమ్య జాస్మిన్ మాట్లాడుతూ అందరికీ సమన్యాయం, ఉచిత న్యాయం అందించేందుకు ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాన్య ప్రజలకు న్యాయ సహాయం అందించేందుకు అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం న్యాయ సలహాదారులను అందుబాటులో ఉంచుతుందన్నారు. ఆర్థిక లేమి కారణంగా న్యాయాన్ని కోల్పోవద్దని సూచించారు.ముఖ్యంగా మహిళలు వీటిని వినియోగించుకోవాలని కోరారు.గృహహింస,వరకట్న వేధింపుల చట్టం లాంటి మహిళా చట్టాల కోసం వివరించారు.అనంతరం స్ఫూర్తి మహిళా మండలి అధ్యక్షురాలు బలగ రాధ,మెప్మా వారు దుశ్శాలువాతో జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య జాస్మిన్ వారిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం లో బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షులు తాడ్డి.తిరుపతి,కార్యదర్శి బి.శ్రీనివాసరావు, పట్టణ స్వయం సహాయక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలన కోసమే ఈ పాదయాత్ర

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: 'జయహెూ జగనన్న చలో తిరుమల పాదయాత్ర'ను ఎస్.కోట పట్టణ శివారు ఆర్కే ఫంక్షన్ హాల్ నుండి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు రెండవ రోజు గురువారం ఉదయం 7:30 గంటలకు తన సతీమణి ఇందుకూరి సుధారాజు, అభిమానులు, నాయకులు వెంటరాగా ప్రారంభించారు. ఎస్.కోట మండలం కొత్తూరు, వెంకటరమణపేట-తిమిడి జంక్షన్, కొత్తబొద్దాం మీదుగా సాగింది. ఈ పాదయాత్రలో, ఎస్.కోట మండల కేంద్రం, కొత్తూరు, తిమిడి, వశి, వెంకటరమణపేట గ్రామాలకు చెందిన ప్రజలు, అభిమానులు పాల్గొని ఎమ్మెల్సీ రఘురాజుకి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలన మళ్లీ రావాలని, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి రెండవసారి ఎన్నిక కావాలన్న సంకల్పంతో తిరుమలకు పాదయాత్ర చేసి శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకొనున్నట్టు వెల్లడించారు. ఈ పాదయాత్రలో ఎమ్మెల్సీతో పాటు ఎస్.కోట ఎం.పి.పి సండి సోమేశ్వరరావు, జెడ్పీటిసి ఎమ్.వెంకటలక్ష్మి, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషి కుమారి, మండలానికి చెందిన పలువురు సర్పంచులు, ఎం.పి.టి.సిలు, వార్డు మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పలు గ్రామాలనుండి ప్రజలు పాల్గొన్నారు.

- ఆకట్టుకున్న మహిళల కోలాటం, నృత్యాలు..

రెండవ రోజు పాదయాత్ర ప్రారంభించిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వెంట మహిళా బృందాల కోలాటం, డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. దారి పొడవునా మహిళలు, అభిమానులు ఎమ్మెల్సీ రఘురాజు, సుధారాజు దంపతులకు మంగళహారతులు ఇచ్చారు. మీ అభీష్టాన్ని శ్రీవెంకటేశ్వర స్వామి నెరవేర్చాలని ఆకాంక్షించారు.

జాతీయ రాయదారి పై అంతరాయం

- గుంతలో చిక్కుకున్న లారీలు
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో ఎం.ఆర్ అగ్రహారం నుండి ఉత్తరావల్లి జంక్షన్ కు ఆనుకొని ఉన్న జాతీయ రహదారిపై గురువారం రహదారి పైన ఏర్పడిన గుంతల్లో వరుసగా రెండు లారీలు చిక్కుకున్నాయి. నిత్యం వందలాదిగా ఎల్లప్పుడూ వాహనాల రద్దీగా ఈ జాతీయ రాగదారిపై తిరుగుతుంటాయి. లారీల గుంతల్లో చిక్కుకుపోవడం వలన ఈ జాతీయ రహదారి రాకపోకలు స్తంభించాయి. కొన్ని ఏళ్ళుగా ఈ రోడ్డు మరమ్మట్టులుకు గురైనా ఎవ్వరు పట్టించు కోలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు... చిలక పాలెం నుండి రామభద్రపురం జాతీయ రహదారి కి అనుసంధానం అయిన ఈ రోడ్డు, అటు వైపు వెళుతున్న భారీ వాహనాలు కు కొన్ని గంటలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు...తరువాత జేసీబీ సహాయం తో బయటకు తీశారు.

గృహహింస నిర్మూలన పై అవగాహన

ఏఎస్ఐ లంక శ్రీనివాసరావు

విశాలాంధ్ర-సీతానగరం: గృహహింస నేరమని, దానిపై చట్టాల్లో ఉండే సారాంశాన్ని ఏఎస్ఐ లంక శ్రీనివాస రావు, పోలీసులు సుజాత, సంపత్ లు తెలిపారు.గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గ్రామస్థాయి స్టేట్ హెూల్డర్స్ ట్రెనింగు నిర్వహించారు. వారు పలు అంశాలపై మాట్లాడారు.పిల్లలఅక్రమ రవాణా నిర్మూలన, గృహహింస నిర్మూలన, బాల్య వివాహాలు నిర్మూలన,బాల కార్మికుల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దీనికి సంబంధించి గోడ పత్రికలను విడుదల చేశారు. గ్రామస్థాయిలో కొంతమందిని ఎంపిక చేసి వారిని రక్ష మరియు కమ్యూనిటీ లీడర్ అని చెప్పి గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి నేడు ఇస్తున్న శిక్షనని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన దిశ యాప్ గూర్చి వివరించారు. ప్రతీ ఒక్కరూ దీన్ని డౌన్ లోడ్ చేసుకొని ఆపదసమయంలో దీని వల్ల రక్షణ పొందాలని కోరారు.

గ్రామ సచివాలయ కమిటీలకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-మక్కువ: మక్కువ మండలంలో ఎంపీడీవో కార్యాలయంలో రక్త హీనతగల గర్భిణీ స్త్రీలు, పాలిచ్చు తల్లులు కౌమార బాలికలు, బరువు తక్కువ పిల్లలు, స్టెంటింగ్ గ్రోత్ పిల్లలు, ఎస్ఎఎం, ఎంఎఎం పిల్లల పరిస్థితులను మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకొనుటకు నియమించిన మండల మరియు గ్రామ సచివాలయం కమిటీలకు అవగాహన సదస్సు స్పెషల్ ఆఫీసర్/పిడి ఐసిడిఎస్ పార్వతీపురం ఎంపీడీవో సూర్యనారాయణ మక్కువ తాసిల్దారు సూర్యనారాయణ సిడిపిఓ ఐసిడిఎస్ మండల లెవెల్ ఆఫీసర్స్ పంచాయతీ సెక్రెటరీ ఏఎన్ఎంలు ఆశ వర్కర్స్ ఎం ఎస్ కె పాల్గొన్నారు.

11 నుండి యేసుక్రీస్తు ప్రార్ధన వారోత్సవాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా కేంద్రమైన విజయనగరంలో ఈ నెల 11 నుండి 17వ తేదీ వరకు జరిగే యేసుక్రీస్తు ప్రార్ధన వారోత్సవాలను విజయవంతం చేయాలని యేసు ప్రేమలయం పాస్టర్ అలజంగి రవికుమార్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని అంబటి సత్రం జంక్షన్ లో గల ఏసుప్రేమాలయంలో గురువారం ఈ ప్రార్థన వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ రవికుమార్ మాట్లాడుతూ పట్టణంలోని గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో ఈ ప్రార్ధనా వారోత్సవాలు ప్రతిరోజు వేకువఝామున 4 నుంచి ఉదయం 6 గంటల వరకు జరుగుతాయన్నారు. యేసు ప్రేమాలయం, క్రిస్టియన్ కల్చర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రార్థన వారోత్సవాలకు దైవజనులు అంతా హాజరై క్రీస్తు స్తుతి గీతాలను ఆలపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ సువర్ణ, విక్టర్ బాబు, ఎన్.నిరీక్షణ,కె.కాలేబు, సత్య, ఎం.ఎస్.ఎస్.మూర్తి, సూర్యనారాయణ, నిర్మల, అరుణ్ కుమార్, నిషాంత్, సునీత, హర్ష, ఏసుపాదం, చౌదరి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్న భక్తులు

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రం సీతానగరంలోగల శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయంలో గురువారం జరిగిన ముడుపుల పూజలకు పెద్దఎత్తున భక్తులు వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో తెల్లవారుజామున నుండి సాయత్రం వరకు శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారికి ఆలయఅర్చకులు పీసపాట శ్రీనివాసాచార్యులు, రామానుజా చార్యులు ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు. ప్రతీగురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలోజరుగుతున్న ముడుపుల పూజలకు వారం వారం భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో అర్చకులు బ్యాచల వారీగా పూజలు చేస్తున్నారు.అనూహ్య స్పందనతో పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాలనుండి భక్తులు విచ్చేసి భక్తిశ్రద్ధలతో, ఉపవాసాలతో పూజలు చేస్తున్నారు. తొమ్మిది వారాలపాటు ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు భక్తులు తెలిపారు.అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

గ్రంథాలయం వారోత్సవాలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర-తెర్లాం: మండలం లో నవంబర్ 14 నుండి 20 వరకు జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు విజయవంతం చేయాలని స్థానిక మండల తహాశీల్దార్ బి. రత్నకుమార్ మరియు డిప్యూటీ తహాశీల్దార్ జి వి భాస్కరరావు కోరారు.ఈ మేరకు స్థానిక గ్రంధాలయ అధికారి కృష్ణ మూర్తి తో కలసి వారోత్సవాలు కు సంబందించిన వాల్ పోస్టర్లు ను గురువారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు స్థానిక శాఖా 6లో నిర్వహిస్తున్నారు.ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలు , పుస్తక ప్రదర్శన విద్యార్థులకు క్విజ్, వకృత్వా పోటీలు , డ్రాయింగ్ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు.

బల్లంకిలో శరవేగంగా సచివాలయం భవనాల నిర్మాణం

నిర్మాణం పూర్తి చేసుకున్న వెల్నెస్ సెంటర్
చివరి దశ పనుల్లో రైతుభరోసా కేంద్రం
బిల్లులు మంజూరు తరువాయి ప్రారంభోత్సవానికి సిద్ధం

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని బల్లంకి గ్రామంలో సచివాలయం భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. సచివాలయం భవన నిర్మాణం 90శాతం పనులు పూర్తి కాగా రైతుభరోసా కేంద్రం నిర్మాణం దాదాపుగా పూర్తి చేసినట్లే. ఈ రెండు భవనాలను గ్రామ సర్పంచ్ బల్లంకి వరలక్ష్మి కనకరాజు దంపతులు నిర్మిస్తుండగా వెల్ నెస్ భవనాన్ని గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బొడ్డు శ్రీనివాసరావు నిర్మించారు. ఈ భవన నిర్మాణం పనులు పూర్తి చేయడమే కాకుండా రంగులు, విద్యుద్దీ కరణ పనులు, బోర్డులు కూడా సిద్ధం చేసారు. సచివాలయభవనం, రైతుభరోసా కేంద్ర నిర్మాణం మరో వారం రోజుల్లో పూర్తి చేసే అవకాశం ఉంది. అయితే టెక్నీకల్ గా ఉన్న సమస్య ఏమిటంటే ఆయా భవనాల నిర్మాణాలు చివరి దశలో ఉన్నప్పటికీ బిల్లులు మంజూరు మాత్రం పూర్తిగా జరగలేదు. కొద్ది కొద్దిగా బిల్లులు మంజూరు కాగా చేతి సొమ్ము ఖర్చు చేసి వాటి నిర్మాణాలు చివరి దశకు తీసుకువచ్చారు. అధికారులు ఎం బుక్ రికార్డు చేసి త్వరితగతిన బిల్లులు చెల్లించగలిగితే ఆ వెంటనే సచివాలయం సముదాయాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి వీలు కలుగుతుంది. దాంతో ప్రస్తుతం ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న సచివాలయం వ్యవస్థను అక్కడ నుండి షిఫ్ట్ చేసి ప్రజలకు సచివాలయం సేవలను సంపూర్ణంగా అందుబాటులోకి తీసుకురావొచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకొని సచివాలయం భవనాల ప్రారంభోత్సవానికి చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాంకేతిక రంగంలో దూసుకుపోతున్న శ్రీ చైతన్య సంస్థ విద్యార్థులు

విశాలాంధ్ర -బెలగాం: ఆధునిక యుగంలో వైజ్ఞానిక ఆవశ్యకతకు అనుగుణంగా సరికొత్త ఆవిష్కరణలకు అడుగు లు వేస్తూ భవిష్యత్ తరానికి దిక్సూచిలా విద్యార్థులకు మార్గ నిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయులు. విద్యార్థులకు జిల్లా టిబి ల్యాబ్ సూపర్ వైజర్ టి. ఉదయ్ కుమార్ చేతుల మీదుగా నాసా కిట్స్ అందించడం జరిగింది. ఈసందర్భంగా పార్వతీపురం శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ బి. జగదీష్ మాట్లాడుతూ వికె దైవిక్ సాహూ, ఆర్. చిన్నికృష్ణ, పి. ఓంకారేశ్వర్, బి. నిఖిలేష్, వై. హర్షిత్ కుమార్, వి. జయశంకర్, డి. సుధీర్, సిహెచ్ అభినవ్, సిహెచ్ మోహిత్ నాయుడు, బి. హేమంత్ కుమార్ విద్యార్థులు ఇంత చక్కటి శాస్త్రీయ ఆవిష్కరణను అందిపుచ్చు కొనే కార్యక్రమంలో భాగస్వాములు కావడం చాలా సంతోషకరమైన విషయమని కొనియాడారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎజిఎం ఎంవి సురేష్, రీజనల్ ఇన్చార్జ్ శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ బాలరాజు, స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ బి. జగదీష్, పాఠశాల డీన్ పి. సుదర్శన్, సి బ్యాచ్ ఇంచార్జ్ ఎం. రవికుమార్, నాసా ఇన్చార్జ్ టి. రామకృష్ణ, ప్రైమరీ ఇన్చార్జ్ సంధ్య, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

61మంది గర్భిణులకు ప్రేమామృత అన్నసమారాధన

విశాలాంధ్ర-వేపాడ : శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు సునీల్ కుమార్ ఆదేశాల మేరకు జోన్-3బానాది శ్రీ సత్యసాయి భజన మండలి వారి ఆధ్వర్యంలో మండల కేంద్రం వేపాడ ప్రాధమిక ఆరోగ్యకేంద్రంలో సుమారు 61మంది గర్భిణీ స్త్రీలకు వారి సహాయకులకు శ్రీ సత్యసాయి ప్రేమామృత అన్నసమారాధన కార్యక్రమం గురువారం నిర్వహించారు. అలాగే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 45మంది గర్భిణీలకు డాక్టర్ ధరణిగైనకాలజిస్ట్ డాక్టర్ మధుబాల పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేసారు. అనంతరం సత్యసాయి భజన మండలి వారు ప్రేమమృత అన్నసమారాధన ఏర్పాటు చేసారు. ఈ సేవా కార్యక్రమంలో బానాది గ్రామానికి చెందిన ఐదుగురు స్త్రీలు, ఏడుగురు పురుషులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు సంపూర్ణ పరిష్కారం

చామలాపల్లి సర్పంచ్ కోలా సతీష్

విశాలాంధ్ర-వేపాడ: పంచాయతీలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించడం జరిగిందని చామలాపల్లి పంచాయతీ సర్పంచ్ కోలా సతీష్ అన్నారు. పంచాయతీలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో మూడు బోరుబావులు, ఎంపీపీ నిధులతో రెండు బోరుబావులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ బోరుబావుల ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు సహకరించిన నేపథ్యంలో వారిద్దరికీ ఎల్లవేళలా రుణపడి ఉంటామన్నారు. ప్రజలు ఈ బోరుబావులను ఉపయోగించుకొని దాహార్తిని తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గన్ను వెంకట సత్యం, వైసీపీ నాయకులు చప్పగడ్డి వెంకటరమణ, సలాది సూర్యనారాయణ, అడపా రమణ, పలువురు గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

సమన్వయంతో కలిసి కార్యక్రమాలు చేద్దాం

టీడీపీ, జనసేన పార్టీల నేతలు

విశాలాంధ్ర-పార్వతీపురం: నియోజక వర్గంలోని టీడీపీ, జనసేన నేతలు కలిసికట్టుగా ఉండి సమన్వయంతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిద్దామని టీడీపి, జనసేన నాయకులు తెలిపారు.గురువారం స్థానిక లయన్స్ క్లబ్ లో నియోజక మొదటి ఆత్మీయ సమావేశం నిర్వహించి పలు అంశాలపై మాట్లాడారు. రాష్ట్ర పార్టీ ఆదేశాలు మేరకు ఈనెల 17నుండి రెండు పార్టీల నాయకులు కలసి బాబుష్యూరిటీ - భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమాన్ని, పలు కార్యక్రమాలని నిర్వహిద్దామని చెప్పారు. ఈకార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర,మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ మున్సిపల్ చైర్మన్ డి.శ్రీదేవి, టీడీపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు బార్నాల సీతారాం, శ్రీనివాసరావు, జి .రవికుమార్, బోనుదేవి చంద్రమౌళి, గొరజాన చంద్రమౌళి, పివిఎస్ఎన్,కొల్లి తిరుపతిరావు, రౌతు వేణు గోపాలనాయుడు, పెంకి వేణుగోపాల నాయుడు తదితరులుతోపాటు జనసేన నాయకులు పాటి శ్రీనివాస్ ,సాయికిరణ్, పైల సత్యన్నారాయణ,అల్లు రమేష్,అచ్యుత్ నాయుడు,ప్రకాష్, పైల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

36 వేలు చేపపిల్లలు పంపిణీ

విశాలాంధ్ర-సీతంపేట: మండలంలోని పులిపుట్టి గ్రామంలోని చెరువులో, భామిని మండలంలోని వడ్డంగి గూడ గ్రామ చెరువులో ఐటిడిఎ పీవో కల్పన కుమారి 36 వేలు చేప పిల్లలను చెరువులలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా పీవో కల్పనా కుమారీ మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని గిరిజన గ్రామాలకు చేపపిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల మత్స్య సంపద పెరిగి గిరిజనులకు జీవనోపాధి తో పాటు ఆర్థిక అభివృద్ధి కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డీవో గోపీకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, వెలుగు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైసిపికి పట్టం కట్టాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: వచ్చే సార్వత్రిక ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు కోరారు. నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి కొండ పేటలో ఎమ్మెల్యే బడ్డుకొండ గురువారం వైసిపి జెండా ఆవిష్కరించి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మొయిద జంక్షన్ ఒకటో సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డులను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో పేదల సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసిపికి పట్టం కట్టాలని కోరారు. సంక్షేమ పథకాల కోసం ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకులు అంధవరపు సూరిబాబు, చైర్ పర్సన్ బంగారు సరోజిని, వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, జెసిఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, కమిషనర్ పి బాలాజీ ప్రసాద్, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో గర్భిణీలకు భోజన వసతి

విశాలాంధ్ర-జామి: ప్రతీ నెలా 9 వతేదీన స్థానిక జామి పిహెచ్సిలో గర్భిణీలకు నెలవారీ తనిఖీలను నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అలాగే గర్భిణీలకు మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని దాతల సహకారంతో అందజేస్తున్నారు. అందులో భాగంగా గురువారం గర్భిణీలకు తనిఖీల అనంతరం మధ్యాహ్నం భోజనంను విశాఖ స్టీల్ ప్లాంట్లో ఇంజినీర్గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన జామికి చెందిన ఆర్జికె ప్రసాద్, సుజాత దంపతులు ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమాన్ని పిహెచ్సి వైద్యాధికారిణి డా. ఎన్.నాగశ్వేత ప్రారంభించారు. అనంతరం 70మంది గర్భిణీలకు భోజనాన్ని నిర్వాహకులు అందజేసారు. ఈసందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ తనిఖీలకు వచ్చిన గర్భిణీలు, వారి సహాయకులు ఆకలితో ఉండరాదనే ఆశయంతో ఇలా భోజన ఏర్పాటు చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సమాజ సేవకుడు నార్లమహ:తి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాధికారత సభను జయప్రదం చెయ్యండి

ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

విశాలాంధ్ర- పార్వతీపురం టౌన్: నేడు పట్టణ పాత బస్టాండ్ లో జరగనున్న నేటి సామాజిక సాధికారిక సభను జయప్రదం చేయాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ కోరారు. గురువారంపార్వతీపురం మండలం లో వివిధ గ్రామాల్లో పర్యటన చేస్తూ ప్రజలకు నాయకులు కార్యకర్తలు కు కలుసుకుని సామాజిక సాధికార సభ రేపు అనగా నవంబర్ 10 మధ్యాహ్నం మూడు గంటలకు పార్వతీపురం పాత బస్సు స్టాండ్ వద్ద జరుగుతుందని ఈ సభలో ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ లు వై వి సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ విద్య శాఖ మాత్యులు, ధర్మాన ప్రసాద రావు, రెవిన్యూ శాఖా మాత్యులు, రాజన్న దొర, గిరిజన శాఖ మాత్యులు మరియు ఉప ముఖ్యమంత్రి, మజ్జి శ్రీనివాస్, జిల్లా పరిషత్ చైర్మన్ గొడ్డేటి మాధవి ఎం పి, ఎం ఎల్ ఏ లు పుష్ప శ్రీవాణి, కళావతి, జోగారావు వివిధ కార్పొరేషన్ ల చైర్మన్ లు ముఖ్య నాయకులు హాజరవుతారు కావున వై ఎస్ ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నిబంధన ల ప్రకారం భూముల వేలం వేయాలి

విశాలాంధ్ర-గజపతినగరం : నిబంధనల ప్రకారం భూముల వేలం వేయాలని అసిస్టెంట్ కలెక్టర్ బి సహదిత్ వెంకట త్రివి నాగ్ దేవస్థానం అధికారులను ఆదేశించారు గురువారం గజపతినగరం మండలంలోని పాత శ్రీరంగరాజపురం లో సీతారామ స్వామి దేవస్థానం భూములను అసిస్టెంట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు చర్యలు తీసుకునేందుకు నాలుగు రోజులు సమయం కావాలని దేవస్థానం అధికారులు కోరారు. కార్యక్రమంలో తాసిల్దార్ మరడాన అరుణ కుమారి రీ సర్వేయర్ జోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే జగన్‌కు మద్దతు ఇవ్వండి

జామి సచివాలయంలో లబ్ధిదారులతో జెడ్పిటిసి గొర్లె సరయు

విశాలాంధ్ర-జామి: అద్వాన్న పరిస్థితిలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పగ్గాలు చేపట్టి ఎంతో ధైర్యంగా సంక్షేమ పథఖాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా నడుపుతున్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికి ప్రతీ ఒక్కరు మద్దతు ఇవ్వాలని జెడ్పిటిసి గొర్లె సరయు కోరారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎపికి జగనే ఎందుకు సిఎం కావాలి అనే కార్యక్రమంను జామి సచివాలయం-1 పరిదిలో ప్రారంభించారు. ముందుగా సచివాలయ పరిదిలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల వివరాలు ఉన్న బోర్డును మండల వైసీపీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్ ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో లబ్ధిదారులతో సమావేశం పిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పిటిసి జగన్ చేసిన సంక్షేమ పథకాల ఫలితాలను వివరించారు. మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రభవిష్యత్ బాగుండాలన్నా, ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా జగన్ సిఎం కావాలని సూచించారు. ఈకార్యక్రమం అనంతరం స్థానిక బస్టాండ్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపిపి ఎస్. అరుణ, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, రాష్ట్ర డైరక్టర్ చలుమూరి సత్యారావు, ఎంపిడివో ఎం.సతీష్, జెసిఎస్ చైర్మన్ చందు, నేతలు గేదెల వెంకటరావు,తోట మధు, పిన్నింటి రవి, కంది నరసింహారావు, కిలారి సూర్యారావు, చెల్లూరి సూరిబాబు,

పల్లె నిద్ర చేసిన ఎమ్మెల్యే..

రాష్ట్రంలో జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను జామి సచివాలయం-1 పరిదిలోని పలువురు కులపెద్దల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చర్చించారు. మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్ ఇంట్లో ఎమ్మెల్యే పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించి అందరితో పాటు విందు చేసారు. ఈసందర్భంగా ఆయా కులాల పెద్దలు జగన్ పాలనలో తాము ఎంతో సంతోషంగా ఉన్నామని, తమ మద్దతు జగన్‌కేనని చెప్పారు.

ప్రభుత్వ భూమి స్వాధీనంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

కంచె తొలగింపులో రెవెన్యూ అధికారులు జాప్యం
నెలలు గడుస్తున్నా ఆర్డీఓ ఆదేశాలు అమలుకాని వైనం

విశాలాంధ్ర-వేపాడ : ప్రభుత్వం భూ చట్ట సంస్కరణ చేసి ల్యాండ్ సీలింగ్ పేరుతో నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతి కుటుంబానికి భూమి ఉండాలనే సంకల్పంతో భూమిలేని నిరుపేదలను గుర్తించి డీ-పట్టా భూముల పేరుతో పేద కుటుంబాలకు భూమిని సాగు హక్కు కల్పించి అప్పగించింది. వారి అవసరాలను గుర్తించిన రియల్ వ్యాపారులు ఆ భూములపై కన్నేసి కొద్దో గొప్పో సొమ్ము రూపేనా ముట్టజెప్పి ఆ భూములను కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు డీ పట్టా భూములని చూడకుండా చేపల చెరువులతో పాటు ఆ భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను కూడా తనదైన శైలిలో ఆక్రమించి తదుపరి ఆ భూముల చుట్టూ కంచే వేసి ఆక్రమిస్తున్న రియల్ వ్యాపారులకు రెవెన్యూ అధికారులు వస్తాసు పలుకుతున్నారా అంటే అవుననే చెప్పాల్సిన పరిస్థితులు దాపరించాయి.

మండలంలోని కొండ గంగుపూడి రెవెన్యూలో సర్వే నెంబరు 136లో ప్రభుత్వం రైతులకు మంజూరు చేసిన డి-పట్టా భూములను ఓ రియల్ వ్యాపారి కొనుగోలు చేసి తనదైన శైలిలో ఆ భూములకు అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి అదే భూముల్లో చేపల చెరువులను తవ్వించి ఆ భూమి చుట్టూ కంచె(పేన్సింగ్) అలాగే గ్రీన్ క్లాత్ ను కట్టి ఆక్రమించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సెప్టెంబర్ నెల 6న ఆర్డీవో ఏ సూర్యకళ కొండగంగుపూడీ రెవిన్యూలో గల అక్రమ లేఔట్ ను సందర్శించి తక్షణమే లేఔట్ వేసిన యజమాని పై చర్యలు తీసుకొని భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని అలాగే హెచ్చరిక బోర్డులో ఏర్పాటు చేయాలని చెప్పారు.అదే రోజు కొండగంగుపూడి రెవెన్యూలో సర్వేనెంబర్ 136 లో డి -పట్టా భూమిగా గుర్తించి ఆ భూమి కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని తదుపరి కంచె తొలగించి పట్టా ఇచ్చిన లబ్ధిదారులను పిలిపించి వారి పటాలను రద్దు చేయాలని ఆర్డిఓ ఆదేశించారు. ఆర్డిఓ ఆదేశించి నేటికి నెలలు గడుస్తున్నప్పటికీ ఆర్డీవో ఆదేశాలు అమలకాయన వైనం నెలకొంది.అలాగే మండల తహసిల్దార్ రెవిన్యూ అధికారులలో ఎటువంటి చలనం లేకపోవడం కంచే తొలగింపులో నిర్లక్ష్యం చేయడంపై పలు అనుమానాలు తావిస్తోంది.కాగా ఇదే భూములు కొనుగోలు చేసిన రియల్ వ్యాపారికి స్థానిక అధికార పార్టీ నాయకుల అండదండల ఉండటంవల్లే ఈ జాప్యం జరుగుతుందని పలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కాగా రియల్ వ్యాపారి తనదైన శైలిలో ఆ భూములలో ఓ కాపలాదారుని పెట్టి కంచె లోపలకి ఎవరైనా వస్తే సహించేది లేదని చెప్పమని సంబంధిత కొనుగోలు చేసిన యజమాని ఆదేశాలు ఉన్నాయని చెబుతున్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారుల జాప్యంతో రియల్ వ్యాపారుల ఆగడాలు పెచ్చు మీరుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్డీఓ ఆదేశాల అనుసరించి మండల రెవెన్యూ యంత్రాంగం స్పందించి రియల్ వ్యాపారులు వేసిన కంచే తొలగించి డి-పట్టా భూముల స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.

ఈ విషయమై మండల తాహసిల్దార్ కె. ప్రసన్నకుమార్ వివరణ కోరగా... మండలంలోని కొండ గంగుపూడి రెవిన్యూలో సర్వే నంబరు 136 లో గల డి-పట్టా భూముల చుట్టూ రియల్ వ్యాపారి వేసిన కంచెలో వున్న భూములను ఆర్డిఓ ఆదేశానుసారం పట్టాలను రద్దుపరిచి భూమిని పిఓటీగా మార్చి ఆన్లైన్లో రెడ్ మార్క్ పెట్టడం జరిగిందని , తదుపరి కంచె తొలగించి భూమిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని తాహసిల్దార్ అన్నారు. అలాగే ఆ భూమిపై ఉన్న కాపలాదారునికి ఈ భూమిపై కాపలాధారుగా మీరు ఉండవద్దని అలా ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రసన్న కుమార్ తెలిపారు.

డి పట్టా భూములో చేపల చెరువు తవ్వించిన దృశ్యం.

రియల్ వ్యాపారి కంచె వేసిన డి- పట్టా భూమి

జనసేన, టీడీపీ పొత్తుతో వైసీపీ బంగాళాఖాతంలో కలవటం ఖాయం..

మండల జనసేన పార్టీ అధ్యక్షులురాలు రౌతు కృష్ణవేణి

విశాలాంధ్ర- మెరకముడిదాం: జనసేన, టిడిపి పొత్తు కలవటంతో వై సీపీ పార్టీకి వణుకు పుట్టిందని మండల జనసేన పార్టీ అధ్యక్షులు రౌతు క్రిష్ణవేణి జోస్యం చెప్పారు. గురువారం నాడు ఆంధ్రప్రభ ప్రతినిధితో ఆమె మాట్లాడుతూ ప్రజల్లో టిడిపి, జనసేన పై ప్రజలుకు అభిమానం ఉందని అన్నారు. అలాగే 175 సీట్లులో టిడిపి,జనసేన పార్టీ గెలవటం తథ్యం అని ఆమె అన్నారు.ప్రస్తుతం రెండు పార్టీలును చూసి వైసీపీపార్టీకి నిద్ర పట్టడంలేదని ఆమె విమర్శించారు.అలాగే ఉత్తరాంధ్రాలో కూగా వైసీపీ ప్రభుత్వం ఓడిపోవటం ఖాయం అని అన్నారు. అంతేకాకుండా వైసీపీ ని ఓడించటం ఖాయం అన్నారు. మండలంలో పార్టీని భలోపేతం చేయటం కోసం అహర్నిశలు కృషి చేసతున్నాని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి మండల పార్టీ అధ్యక్షులు విజినిగిరి శ్రీనివాసరావు, కార్యాకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవా సాధికారత చట్టంతో అర్హులందరికీ ఉచిత న్యాయ సహాయం

న్యాయమూర్తి సబ్బవరపు వాణి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: స్థానిక మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సభకు అధ్యక్షత వహించిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి, మండల సేవా కమిటీ చైర్మన్ సబ్బవరపు వాణి మాట్లాడుతూ లింగ, వయో, వర్గ బేధం లేకుండా ఎవ్వరయినా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. షెడ్యూల్డ్ కులం లేక తెగకు చెందినవారు, మానవ అక్రమ రవాణా బాధితులు, భిక్షాటన చేయువారు, స్త్రీలు, పిల్లలు, మతి స్థిమితం లేనివారు, హింసాకాండ, కుల వైషమ్యాలు, విపత్తులలో చిక్కుకున్నవారు, పారిశ్రామిక కార్మికులు, వార్షిక ఆదాయం మూడు లక్షలకు మించనివారు ఉచిత న్యాయ సహాయం పొందడానికి అర్హులన్నారు. న్యాయవాదిచే ఉచితంగా న్యాయసలహాలను యిప్పించడము, అవసరమైతే దరఖాస్తుదారుని తరపున న్యాయవాదులను నియమించి సంబంధిత కోర్టుల్లో కేసులు చేపట్టడం జరుగుతుందన్నారు. తాలూకా స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఏ కోర్టు ప్రాంగణంలోనయినా ఉచిత న్యాయ సేవల కొరకు న్యాయ సేవా సంస్థల యందు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీనియర్ న్యాయవాది గేదెల ప్రకాశ రావు మాట్లాడుతూ న్యాయం దృష్టిలో అందరూ సమానులే. న్యాయానికి గొప్ప, బీద అన్న తేడా లేదన్నారు. అతిథిగా పాల్గొన్న యస్.ఐ. జె. తారకేశ్వరరావు మాట్లాడుతూ ఏ పౌరుడూ ఆర్థిక కారణాల మూలంగా గాని మరే ఇతర బలహీనతల మూలంగా గాని న్యాయాన్ని పొందే అవకాశాలను కోల్పోకుండా ఉండం కోసం ఉచిత న్యాయ సహాయం అందించేందుకు ప్రభుత్వం న్యాయ సేవా కమిటీల ద్వారా కృషి చేస్తుందన్నారు. 1976 వ సంవత్సరంలో భారత రాజ్యాంగానికి అధికరణ 39 ఏ జతచేసి బీద, బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సహాయాన్నందించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత గా నిర్దేశించారని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మామిడి చంద్ర శేఖర్ చెప్పారు. న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ జాతీయ న్యాయ సేవల సాధికారత చట్టం 1995 లో ఏర్పాటు చేసిన దగ్గర నుండి వేలాది మంది ఉచితంగా సేవలను పొందారన్నారు. న్యాయవాది బి.సత్యన్నారాయణ వందన సమర్పణతో సభ ముగిసింది. బార్ అసోసియేషన్ కోశాధికారి బి.త్రిమూర్తులు, ఆర్.సత్యన్నారాయణ, వి.రమణ, రామమూర్తి, వెంకటరావు, శేఖర్ బాబు తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు ఉద్యోగి బి.శ్రీనివాసరావు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిభిరానికి అనూహ్య స్పందన

సుమారు 72. మందికి చికిత్సలు

విశాలాంధ్ర-మెరకముడిదాం : మెరకముడిదాం స్థానిక పిహెచ్ సి లో శంకర్ ఫౌండషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. వైద్యశిభిరానికి సుమారు 72 మంది రోగులు హాజరు అయ్యారు. హాజరు అయిన రోగులుకు అజిత్ బాబు, కంటి వైద్య నిపుణులు శస్త్ర చికిత్సలు జరిపారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా లేకుండా సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా కంటి చికిత్స నిమిత్తం రోగులను విశాఖపట్నం తరలించారు. అంతేకాకుండా రోగులుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ వి లక్ష్మి, ఏ ఎన్ ఎం లక్ష్మి, సి హెచ్ ఓ రామారావు, తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితునికి ఆర్థిక సహాయం అందజేత

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థాన బాయ్స్ ఆర్.సి.యం స్కూల్ లో విద్యను అభ్యసించిన 1995 వ సంవత్సరం బ్యాచ్ కు చెందిన ఇస్కల శేఖర్ పట్టణంలోని రెల్లి వీధిలో నివాసం ఉంటున్నాడు.గత కొంతకాలం నుండి టీబీ వ్యాధి అనారోగ్యం ,ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ బతుకు జీవనం కొనసాగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న చిన్న నాటి స్నేహితులు కష్టం చూసి నీకు మేమున్నాం భయపడొద్దు మా వంతు సహాయ సహకారం ఎప్పుడూ ఉంటుందని తనకు ధైర్యాన్ని ఇచ్చి స్నేహితులు అందరూ కలిసి వచ్చి రైస్, కిరాణా సామాన్లు, మెడికల్ ఖర్చు నిమిత్తం 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 1995 పూర్వ విద్యార్థులు, శ్రీ సాయి అమ్మా యువజన సేవా సంఘం సభ్యులు, బెలగాం జయప్రకాష్ నారాయణ, సుంకరి కమల్ కుమార్, జమ్మూ మురళి, పిల్ల శ్రీనివాసరావు, చెవిటి లక్ష్మణరావు, బెనియా లక్ష్మీనారాయణ, కొత్తకోట కోటి, దేవుపల్లి దాసు, కొరాడ చక్రధర్, అందజేశారు. అనంతరం బెలగాం జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ తన స్నేహితుడు తొందరగా కోలుకోని, ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డు ఎమ్మెల్యే ప్రారంభం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా ఎస్.కోట-1 సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలు డిస్ ప్లే బోర్డుని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ద్వారా ఎస్.కోట-1 సచివాలయం పరిధిలో లబ్ధిదారులుకు ప్రత్యక్షంగా జగనన్న అమ్మఒడి, రైతు భరోసా, వై.ఎస్.ఆర్ చేయూత, వై.ఎస్.ఆర్ కాపునేస్తం వంటి సుమారు 25 పథకాల ద్వారా లబ్ధిదారులు రూ.25 కోట్ల 40 లక్షల 90వేలు లబ్ధి పొందారని చెప్పారు. అలాగే పరోక్షంగా జగనన్న విద్యాకానుక, జగనన్న తోడు, జగనన్న గోరుముద్ద, ఇంటిస్థలాలు వంటి చక్కటి పథకాలు ప్రవేశపెట్టిన జగన్ మోహన్ రెడ్డికి మనం ఎప్పుడు రుణపడి ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ జెండాని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షుడు మోపాడ కుమార్, ఫోక్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, జేసీఎస్ ఇంచార్జి వాకాడ సతీష్, పోతనపల్లి వెంకటరావు, బుగత వెంకటేశ్వరరావు, సారిపల్లి గణేష్, దారగిరి, ఎంపీటీసీ కదారి అప్పయ్య, ఆవాల కృష్ణతలారి అనంత్, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జెడ్పిపి చైర్మన్ కు నిరసన వెల్లువ

విశాలాంధ్ర-మెరకముడిదాం : మెరకముడిదాం గ్రామంలో గురువారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంనకు హాజరు అయిన జనసేన పార్టీ నేతల నుండి స్థానికుల నుండి నిరసన అధిక సంఖ్యలో వ్యక్తం అయింది. నిన్న మొన్నటి వరకు వైసీపీ నేతలుకు నిరసన లేనప్పుడు ఈ రోజు స్థానికులు ఇంత ఎక్కువగా నిరసన తెలపటం పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయటం విశేషం. మినిపెన్నడు లేనివిధంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయ టం విశేషం. వై సీపీ పార్టీని అడ్డుకోవటం ఉద్రిక్తత నెలకొంటుందని, వారిని అరెస్ట్ సేయడం జరిగింది. గడప గడప కు ఊహించిన స్థాయిలో జరగలేదు. దీంతో స్థానికలు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

మెటీరియల్ ట్రాన్సిపోర్ట్ వాహనాలు జియోట్యాగింగ్ పరికరాలు అమర్చుకోవాలి

ఎఎంవిఐ సత్యనారాయణ

విశాలాంధ్ర-కురుపాం: ట్రాన్సిపోర్ట్ వాహనాలు,ట్రాక్టర్ లు జియో ట్యాగింగ్ మిషన్లు తప్పనిసరి గా ఏర్పాటు చేసుకోవాలని ఎఎంవిఐ సత్యనారాయణ సూచించారు. గురువారం మండలం లోని పి లేవిడి పెట్రోల్ బంక్ సమీపంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. ప్రభుత్వం ,రాష్ట్ర రవాణా శాఖ ఆదేశాలు మేరకు జియోట్యాగింగ్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రతీఒక్క లకేజీ వాహనం ,ట్రాక్టర్ లు జియోట్యాగింగ్ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు... రాభోయో సీజన్లో గ్రామాల్లో నుంచి మిల్లు లకు ధాన్యం రవాణా కు వాహనాలు పెట్టేందుకు వాహనదారులు సిద్ధంగా ఉండాలని కోరారు.. తప్పనిసరి గా అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని ఆదేశించారు.

15 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-బొబ్బిలి: స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఆర్. జైభీమ్ ఆధ్వర్యంలో మండలం పిరిడి గ్రామానికి కి చెందిన సంజీవి అను వ్యక్తి ని మద్యం సీసాలు అమ్ముతుండగా పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ విలేకరులతో మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం సీసాలు మరియు నాటుసారాయి విక్రయిస్తే 9440902372 కు సమాచారం ఇవ్వవలసినది గా కోరారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది మాధవి,చంద్ర ప్రసాద్ మరియు జయరాం నాయుడు లు పాల్గొన్నారు

అమల్లోకి జిల్లా కలెక్టర్ ఆదేశాలు

కుమ్మపల్లి ఎస్సీ కాలనీలో సమస్యల ప్రక్షాళనకు శ్రీకారం

సీసీ రోడ్డుపై చెత్త చెదారం తొలగింపు

హర్షం వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నేతలు

విశాలాంధ్ర-వేపాడ : జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి జారీ చేసిన ఆదేశాలు అమల్లోకి వచ్చాయి. గతనెల 25న గ్రామానికి చెందిన ఉత్తరాంధ్ర మాల మహానాడు అధ్యక్షులు గొల్ల ఈశ్వరరావు మండలంలోని కుమ్మపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పేరుకుపోయిన సమస్యలపై చేసిన ఫిర్యాదుపై ఆమె స్పందించారు. అక్కడి సమస్యలపై పరిశీలన జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేయడంతో గత నెల 28న మండల పంచాయతీ విస్తరణాధికారిణి ఉమ, ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ దేవి, మండల సర్వేయర్ అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి మూర్తి తదితరులు గ్రామానికి విచ్చేసి ఎస్సీ కాలనిలో సీసీ రోడ్డుపై మురికినీటి నిల్వ, డ్రైనేజి సమస్య, విద్యుత్ సమస్యలు, బోరు బావి వద్ద మురికినీటి నిల్వ వంటి సమస్యలను గుర్తించి జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పించారు. ఈ మేరకు వాటన్నింటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడంతో గురువారం పంచాయతీ కార్యదర్శి మూర్తి సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ముందుగా సీసీ రోడ్డుపైన, మురికినీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం నుంచి జేసీబీ తో పూర్తిగా చెత్త చెదారం తొలగింప జేస్తామని పంచాయతీ కార్యదర్శి చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సీ కాలనీలో సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టడం హర్షణీయమని ఉత్తరాంధ్ర జిల్లాల మాలమహానాడు అధ్యక్షులు గొల్ల ఈశ్వరరావు సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాస్ చారేందర్, మాలమహానాడు నాయకులు ఎల్ల రాంబాబు, కణితి విజయ్, కాకర సతీష్ తదితరులు పనులను పరిశీలించారు.

మార్కెట్‌లో వినూత్న ఆలోచనలకు సవాలు వంటిది

=- లెండి లో ప్రముఖ ఎంట్రప్రెన్యూర్ డాక్టర్ మాదాల దీపక్

విశాలాంధ్ర-డెంకాడ: లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో, ఇన్నోవేషన్ &ఇంక్యుబేషన్ సెల్ మరియు ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ సంయుక్తంగా జాతీయ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపవరింగ్ యూత్ ఫర్ ఎకనామిక్ సక్సెస్ అనే కార్యక్రమాన్ని నిర్వహించాయి. ముఖ్య అతిథిగా ఐటి అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (ఐటిఎఎపి) వ్యవస్థాపక అధ్యక్షుడుగ మరియు ఆల్కోవ్ పార్ట్‌నర్స్ వ్యవస్థాపకుడైన డాక్టర్ దీపక్ ఎస్.మదాల, పాల్గొని ప్రస్తుత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ మరియు స్టార్టప్ కల్చర్ కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పట్ల ఆసక్తి కోసం విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను పంచుకోవడంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఆలోచనలతోనే కాకుండా వాటికి నిజ స్వరూపాన్నిచ్చి ఎంట్రప్రెన్యూర్ గా ఎదగడానికి ఇతరులతో చర్చించడం, వారి ఆలోచనలను పంచుకోవడం వంటి కార్యాచరణను అనుసరించాలని కోరుతూ తన అనుభవాన్ని ఉపయోగించి సూచనలు అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహించారు. మార్కెటింగ్, మార్కెట్ వాటాను పొందడం, కస్టమర్‌లను కనుగొనడం వంటి వ్యవస్థాపకత యొక్క సవాళ్లను వివరిస్తూ సమస్యలపై వినూత్న ఆలోచనలను స్వీకరించడానికి మరియు భవిష్యత్తులో ఒక సంస్థగా ఎదగడానికి విద్యార్థులను ప్రేరేపించి విజయవంతమైన వ్యాపారవేత్తల ఆలోచనలు మరియు ఆలోచనను రూపొందించే విధానాన్ని అర్థం చేసుకోవడానికి విద్యార్థులు వివిధ వినూత్న పోటీలలో పాల్గొనడం చేయాలనీ తెలిపారు. వ్యవస్థాపకులు వల్ల కొత్త మార్కెట్‌లను నెలకొల్పడము వల్ల సమాజం మరియు దేశం యొక్క ఆర్థిక వృద్ధిని దోహద పడతారని తెలిపారు. ఎంట్రప్రెన్యూర్‌షిప్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు విద్యార్థినీ విద్యార్థులు మార్కెటింగ్, ఇంటర్ప్రెన్యూర్‌షిప్, స్టార్ట్ అప్ లపై తమ కున్న పరిజ్ఞానం తో ప్రసంగించారు. ఇలాంటి సెషన్లను భావి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు బాటల గా రూపొందించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రామారెడ్డి సూచించారు. ఈ సెషన్‌లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.హరిబాబు, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెల్ ఇంచార్జి డాక్టర్ ఎ.వి పరాంకుశం, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యూబేషన్ సెల్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ సభ్యులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి : మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం టి.ఆర్ కోలని 25,26 వార్డ్ ల్లలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు , మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ ,26వ వార్డ్ కౌన్సిలర్ మరిపి తిరుపతి రావు , 25వ వార్డ్ ఇంఛార్జి పోల చిన వెంకట రావు , సచివాలయం కన్వీనర్లు,వైద్య సిబ్బంది మరియు మున్సిపల్ సిబ్బంది సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే ఎందుకు రావాలి?..



విశాలాంధ్ర-కురుపాం: మళ్లీ జగనన్నే ఎందుకు రావాలి కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలు బోర్డు ను కురుపాం..2 సచివాలయంలో మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ,వైసీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్తు రాజు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత మోసపూరిత తెలుగు దేశం పార్టి ప్రభుత్వం లా ఎన్నికల ముందే ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే పార్టీ వైసీపీ కాదని అన్నారు. మ్యానిఫెస్టోలో పొందుపరచిన ప్రతీఒక్క హామీ ని నేరుగా ఇంటి వద్దకు ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా నేరుగా అర్హులైన వారందరికీ అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు. సంక్షేమ పథకాలు మంజూరు లో ఏఒక్క ప్రజాప్రతినిధి జోక్యం లేకుండా నేరుగా వాలంటీర్ వివరాలు తీసుకుని ఆన్లైన్ చేయడమే తడువుగా బటన్ నొక్కి మహిళలు ఖాతాలో నికి జమ చేస్తున్నారని అన్నారు. పార్టీలు తో సంబంధంలేకుండా ,ఓట్లు వేయని వారికి కూడా తారతమ్యం లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగనన్న ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి అఖండ విజయం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి ,జడ్పీటీసీ సుజాత ,జడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ నిషార్ ,సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీలు స్వామి ,బంగారు నాయుడు ,సంతోషి ,కన్వీనర్ గౌరీశంకర్, నాయకులు ,శెట్టి నాగేశ్వరరావు ,అంధవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీ పతాకాన్ని ఆవిష్కరించిన కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ కి జగన్ ఎందుకు కావా లంటే అనే కార్యక్రమం ప్రారంభ సూచికగా ఒకటో డివిజన్ సచివాలయ ప్రాంతంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, జోనల్ ఇన్చార్జి ముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ ఎరుగని విప్లవాత్మక పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో తీసుకొచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలన ప్రజల ముంగటికే తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విద్యా వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించుకోవాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్ ,ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, నగర పార్టీ అధ్యక్షులు ఆసపు వేణు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం ఏమి చేశారు?

శ్వేతపత్రం విడుదల చేయాలి...

టిడిపి సీనియర్ నాయకులు మజ్జి వెంకటేష్

విశాలాంధ్ర-బెలగాం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న ప్రతి సామాజిక వర్గానికి సుమారు 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేశారు. కార్పొరేషన్లకు సంబంధించి ఆయా కులాల పార్టీ పెద్దలను గుర్తించి రాష్ట్ర చైర్మన్లు నుండి డైరెక్టర్ల వరకు పదవులు ఇచ్చారే తప్ప సామాజిక కులాలకు సంబంధిత కార్పొరేషన్ నుండి ఏమి లబ్ది చేకూర్చారో అని రాష్ట్ర ప్రజలకు తెలిసే విధంగా ఒక శ్వేత పత్రం వైయస్సార్ పార్టీ విడుదల చేసి, రాష్ట్రమంతటా సామాజిక సాధికారిత బస్సు యాత్ర చేసి ఉంటే ప్రజలకు నిజా నిజాలు తెలిసేవని, పార్వతీపురం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మజ్జి వెంకటేష్ అన్నారు. ఈమేరకు ఆయన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్వతీపురంలో శుక్రవారం జరగబోయే బస్సు యాత్ర పార్టీ ప్రయోజనాలకే తప్ప ప్రజలకు మంచి జరిగేది ఏమీ లేదన్నారు. అంతేకాకుండా రేపు జరగబోయే ఎన్నికలకు బల నిరూపణ కోసమే ఈ బస్సు యాత్రలు రాష్ట్రంలో జరుగుతున్నాయని తెలిపారు.

కాశీ పట్టణ పంచాయతీలో బోడిమెట్ట పైఅక్రమ తవ్వకాలు

విశాలాంధ్ర-మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలంలో కాశీపట్నం పంచాయతీలో గల బోడిమెట్ట పై అక్రమ తవ్వకాలు బోడిమెట్ట పరిధిలో మూడు రోజులుగా కంకర తవ్వకాలు జరుగుతున్నయి ఇక్కడ నుండి సీతానగరం మండలం తామర కండి నుండి బక్కుపేట వెళ్లినూతన రహదారికి కంకర తరలిస్తున్నారు మన్యం జిల్లా సంస్థ నుండిసంబంధించి గనుల శాఖ రాఘవ కనక్షన్ సంస్థ నుండి సుమారు1000 క్యూబిక్ మీటర్లు రవాణా రసీదులు సంబంధిత కాంట్రాక్టర్ పొందుతున్నారు ఈ రసీదులను అనుమతి పత్రాలు చూపించి కంకర తరలించుకు పోతున్నారు రాఘవ కన్స్ట్రక్షన్ ఏ అనుమతి ఇవ్వలేదని విలేకరులకు తెలియపరిచారు బోడి మెట్ట కంకర తవ్వకాలు ఇటువంటి ఇటువంటి అనుమతి లేదని మక్కువ తాసిల్దార్ సూర్యనారాయణ విలేకరులకు తెలిపారు మైనింగ్ శాఖ అధికారులు కూడా ఎటువంటి అనుమతులుఇవ్వలేదని తెలిపారు బోదుమెట్ట కంకర తవ్వ కాలు ఎటువంటి పర్మిషన్ లేకుండా తరలించినప్పటికీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులను గుర్తించండి

– టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్

విశాలాంధ్ర-శృంగవరపుకోట : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఓటర్ల జాబితా తప్పులు తడకగా ఉందని, ఓటర్ల జాబితాలో తప్పులను గుర్తించాలని తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ టీడీపీ నాయకులకు సూచించారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండలంలో గల వివిధ గ్రామాల్లో పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ ఆదేశాలు మేరకు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో సున్నా ఇంటి అడ్రస్, నెంబరుతో అధిక సంఖ్యలో ఓటర్లు ఉండడం, ఒకే కుటుంబానికి వేరువేరు పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు ఉండడం జాబితా పరిశీలనలో బయటపడుతున్నాయని కావున ప్రతి ఒక్కరూ మీ గ్రామాల్లో ఓటర్ల ఇంటికెళ్లి ఓటర్ల జాబితాను సరిచూసి సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ అభిమాని ఉన్న ఇంట్లో మిగతా వాళ్లను వాలంటర్లు ప్రలోభ పెడుతూ జగనన్న పథకాలను పొందుతున్నారని.. ఆలోచించుకుని ఓటు వేయాలని గందరగోళం సృష్టిస్తున్నారనే విషయం తెలియవచ్చిందని, నాయకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా చంద్రబాబు ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, మన కార్యకర్తలపై కేసులు పెడితే వారికి మనం ఉన్నామని అభయం ఇవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన ఓటర్ల జాబితాను ఆయా గ్రామాల నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎం. మంగరాజు, ఆదారి రమేష్, ఆదారి మహేశ్వరరావు, జుత్తాడ రామసత్యం, జనవాద సన్యాసినాయుడు, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణీల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

డిఐఓ డాక్టర్ జగన్మోహన్‌రావు

విశాలాంధ్ర-కొమరాడ: మండలంలో గురువారం రామభద్రపురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్యంద్రాలో నిర్వహించిన ప్రధాన్ మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పిఎమ్ఎస్ఎమ్ఎ) కార్యక్రమాన్ని డీఐఓ డాక్టర్ టి. జగన్మోహనరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణీలకు చేపడుతున్న ఆరోగ్య తనిఖీలను, నమోదు వివరాలు ఆయన పరిశీలించారు. ముఖ్యంగా బిపి,మధుమేహం, హీమోగ్లోబిన్, బరువు, మూత్ర పరీక్షల నివేదికలను పరిశీలించి హెచ్చు, తగ్గులు ఉన్నవారికి తగు చికిత్స అందజేసి సాధారణ స్థితి పొందే వరకు పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.అక్కడ గర్భిణీ లతో డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడి వారి ఆరోగ్య స్థితిని పర్యవేక్షించారు.ప్రతీ గర్భిణీ కి నిర్దేశించిన కాన్పు తేదీని తెలియ జేయాలని సిబ్బందికి సూచించారు.హైరిస్క్ గర్భిణీలకు కాన్పు సమయానికి వారం ముందుగానే నిర్దేశించిన ఆసుపత్రిలో చేర్చాలన్నారు.అదేవిధంగా సాధారణ ప్రసవాలు పిహెచ్సి లో జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేసిన వైద్య పరికరాలను, మందులు,పరీక్షలు విధిగా ఉపయోగించి ప్రసవ సమయానికి గర్భిణీలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. పిఎమ్ఎమ్వివై, జెఎస్వై,జెఎస్ఎస్కె,ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా అర్హులైన గర్భిణీ లకు సకాలంలో అందేలా చూడాలన్నారు. టిడి వ్యాక్సినేషన్ రెండు డోసులు నిర్దేశించిన సమయానికి వేయడం జరిగిందా ఎమ్సిపి కార్డులో పరిశీలించారు. కిల్కారీ సేవలు ఏ మేరకు వినియోగిస్తున్నారో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సిహెచ్ అరుణ్ కుమార్, డాక్టర్ బిఎస్జె శామ్యూల్, డాక్టర్ ఎమ్.శిరీష,సూపర్ వైజర్స్ విజయకుమారి,శారద, నిర్మల,జయగౌడ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

కొత్తవలసలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం

విశాలాంధ్ర-సాలూరు రూరల్: మండలంలో కొత్తవలస పంచాయతీలో కొత్తవలస, బుట్టగానివలస, దాగరవలస, గుంద్రపువలస గ్రామాలలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల.పరమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెదేపా ఇంఛార్జ్ గుమ్మిడి సంధ్యారాణి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.పి.భంజ్‌దేవ్ లు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెదేపా మ్యానిఫెస్టో లో ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ,మహాశక్తి పథకాలకి ప్రజలలో విశేష స్పందన లభిస్తుందన్నారు.పై గ్రామాలలో ప్రతీ గడపకి వెళ్లి పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు.ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం,దీపం పథకం,మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను వివరించామన్నారు.5 ఏండ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. యువగళం నిధి రూపంలో నెలకు 3000 రూపాయలు, అన్నదాతకు ఏడాదికి 20 వేల రూపాయలు,బిసి లకు రక్షణ చట్టం, పేదలను సంపన్నులు చేస్తాం,ఆదాయం రెట్టింపు చేస్తామని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు.వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతో పాటు ప్రజలంతా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కోరారు. కార్యక్రమంలో వీరితో పాటు సీనియర్ తెదేపా నాయకులు ఆముజూరి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఆముజూరి రూపవతి, అప్పికొండ యుగంధర్,రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో మా నమ్మకం నువ్వే జగన్

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం: మండలం ఎల్విన్ పేట పంచాయితీ ,జేకే పాడు గ్రామం లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ప్రత్యక్ష నగదు బదిలీ డిబిటి లో 25 పథకాలు గురించి పరోక్ష ప్రయోజనాలు నాన్ డి బి టి 13 పథకాల గురించి మొత్తం 38 పథకాలు గురించి మండల ఎంపీపీ %ని%. దినమయ్య మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి అమలుపరుస్తున్న ప్రతి పథకం సచివాలయం పరిధిలో ఎంతవరకు అమలవుతుందని ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారని తెలుసుకోవాలని అన్నారు. దళారుల వ్యవస్థ అవకాశం లేకుండా పరోక్షంగా ప్రత్యక్షంగా లబ్ధిదారులకు చేకూర్చేలా చేశారు. గిరిజన గ్రామాలలో ఎప్పుడూ చూడని పథకాలు సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టి నేరుగా లబ్ధిదారుల నుండే అందుతున్నాయో లేదో తెలుసుకుంటున్నారు. మతాలకు పార్టీలకు అతీతంగా పేద కుటుంబాలకు నేరుగా బటన్ నొక్కి అందజేస్తున్నారు. అమలు చేసిన పథకాలు ప్రతి ఇంటికి పోవాలి అనే ఉద్దేశంతో ప్రజలకు అర్థమయ్యేటట్లు గ్రామస్థాయిలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ద్వారా తెలియజేశారు. అర్హులైన అందరూ అక్కాచెల్లెళ్లకు అన్నదమ్ములకు అవ్వ తాతలకు పారదర్శకంగా లంచాలకు వివక్షకు తావు లేకుండా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వివిధ పథకాల ద్వారా అర్హులైన పేదలందరికీ డిబిటి నాన్ డి బి టి ద్వారా అందించిన లబ్ధి అక్షరాల 4,69,459.45 కోట్లు ఈ కార్యక్రమం అనంతరం పార్టీ కార్యకర్తలు నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కే దినమయ్య, జెడ్ పి టి సి, ఎంపీడీవో, వైస్ ఎంపీపీ ఎన్ శేఖర్, సర్పంచ్, జె సి ఎస్ మండల ఇంచార్జ్ గిరిబాబు పాల్గొన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం 40 రోజులు పాటు ప్రతిరోజు మూడు గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతుంది.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి కరణం డిమాండ్

విశాలాంధ్ర-గజపతినగరం: వర్షా బావ పరిస్థితులు కారణం గా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ డిమాండ్ చేశారు గురువారం మండలంలోని మధు పాడ గ్రామంలో ఎండిన పంటలను శివరామకృష్ణ పరిశీలించారు సాగునీరు అందించ లేనప్పుడు కరువు మండలాలుగా ప్రకటించి ఆదుకోవాలని అన్నారు రైతులు దేశానికి వెన్నుముక దేశానికి ఆహారం పెట్టగలిగిన వాడు రైతు పంట కాలువలో సాగునీరు సరఫరా కాకపోవడం దానికి తో రైతులతో కలిసి నిరసన తెలిపారు ఆం ధ్రా రిజర్వాయర్ నుండి పంట కాలువ ద్వారా సాగునీరు సరఫరా చేయలేకపోవడం అంటే హీన పరిస్థితి మరొకటి ఉండదని అన్నారు మన రాష్ట్రంలో అధిక శాతం వ్యవసాయం పై ఆధారపడి ఉన్న వారేనని వీరు ప్రకృతి కరుణాకటాక్షం మీద ఆధారపడి బ్రతుకుతున్నారన్నారు వర్షాలు లేక వారి జీవన విధానం విచ్ఛిన్నమైనదని రైతులకు పొలం పనులలో కావలసిన పనిముట్లను ఈ సైకో జగన్ ప్రభుత్వం ఇవ్వకపోవడం చాలా దారుణం రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు జీవన మరణ సమస్యగా నేడు రాష్ట్ర రైతాంగం పరిస్థితి ఉంటే దానిని పక్కన పెట్టి సామాజిక సాధికారత యాత్ర పేరుతో ఎవరి నీ ఎవరి నంక నాకమని చెప్పేందుకు ఈ సైకోలే తీర్చుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో పాతబగ్గం గ్రామ సర్పంచ్ లంక పద్మావతి మాజీ సర్పంచ్ లంక చిన్నమనాయుడు మధుపడ మాజీ వైస్ సర్పంచ్ పిన్నింటి లక్ష్మినాయుడు మిడతన మహేష్ ఆర్ సత్యనారాయణ రవికుమార్ తాడి శంకర్రావు దుర్గారావు మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.